ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:19 (ఆది)
సహరి : 4:54 (సోమ)



జల యుద్ధం!

సాగర్ జలాల వాటాలో చిక్కులు

32 టీఎంసీలపై తెలంగాణ వక్రభాష్యం

- పూర్తిస్థాయిలో నీరు రాక ఆయకట్టు రైతుల ఇక్కట్లు
- కె.ఆర్.ఎం.బి క్షేత్రస్థాయి పరిశీలనకు రాకపోవడం వల్లే ఈ పరిస్థితి..
- నీటిసంఘాల నాయకుల ఆవేదన

(నూజివీడు-ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ పరిధిలోని 2వ, 3వ జోన్ నీటి కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ వాదనకన్నా తెలంగాణ వాదనే నెరవేరుతోందన్న వాదన రాష్ట్ర విభజన తర్వాత 2, 3వ జోన్‌ల నీటి పంపిణీ విషయంపై జరుగుతున్న చర్చల్లో తేటతెల్లమవుతోంది. రాష్ట్రవిభజన అనంతరం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు 2,3వ జోన్‌లకు 102వ కి.మీ వద్ద 32 టీఎంసీలను కేటాయించగా, తెలంగాణ రాష్ట్రం నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు 32 టీఎంసీల నీటి విడుదలను చూపుతోంది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జున సాగర్ ఎడమ కాల్వ పరీవాహక ప్రాంతాల్లో పూర్తి స్థాయి వాటా లభించక, ఇక్కడ ఆరుతడి పంటలు వేసిన రైతులు సాగునీరు అందక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని నీటిసంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలో ఈ కాల్వ కింద 2.20 లక్షలకు ఎకరాల ఆయకట్టు ఉంది.

రాష్ట్ర విభజన అనంతరం అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌తోపాటు కేంద్రపరిధిలోని అధికారులతో కె.ఆర్.ఎం.బిని ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఉత్తర భారతదేశానికి చెందిన అధికారుల నేతృత్వంలో బోర్డు ఉండడంతో వారు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా కార్యాలయాలకే పరిమితమై, నీటి వాటాలను నిర్ణయిస్తున్నారని, ఫలితంగా ప్రస్తుత సాగునీటి కొరత పరిస్థితులు నెలకొంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షాకాలంలో పడిన భారీవర్షాలకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కాల్వలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి మరమ్మతులు చేయాల్సిన స్థానిక అధికారుల వైఫల్యం 2,3వ జోన్‌ల పరిధిలోని కాల్వలకు నీటిలభ్యత తగ్గడానికి కారణం. ప్రస్తుత సీజన్‌లో దాదాపు 11 టీఎంసీల వరకు సాగునీరు విడుదల కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎగువ, దిగువ కాల్వల్లో యూటీలకు రంధ్రాలు చేసి నీటి చౌర్యం చేస్తుండడంతో వాస్తవ హక్కు ఉన్న ఆరుతడి పంటల రైతులకు చుక్కసాగు, తాగునీరు అందని పరిస్థితి. ప్రస్తుతం నీటి విడుదల గడువు ముగుస్తున్న క్రమంలో నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథితో పాటు మైలవరం, తిరువూరు, గన్నవరం, దెందులూరు ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తెలంగాణ నుంచి హక్కుగా రావాల్సిన సాగునీరును విడుదల చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆంధ్రా బోర్డర్‌లో 32 టీఎంసీల నీరు ఇవ్వాలి..



సాగర్ ఎడమకాల్వ పరిధిలో గల 102వ కి.మీ వద్ద 32 టీఎంసీల నీటిని ఇవ్వాలి. ప్రస్తుతం ఆరుతడిపంటలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎన్ఎస్‌పీ నుంచి సాగునీరు విడుదల చేయాలి. 2020లో ఇదే పరిస్థితి ఏర్పడగా, నాటి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో ఆందోళన చేసి నూజివీడు ప్రాంతానికి సాగు, తాగునీటిని తీసుకొచ్చాం. రైతుల ప్రయోజనాల దృష్ట్యా మూడోజోన్ పరిధిలో నీటి విడుదల గడువును మరో నెల పెంచాలి.

- లావు నాగవరప్రసాద్, రెడ్డిగూడెం మాజీ డీసీ చైర్మన్

విమర్శలు వద్దు.. నీరు ఇవ్వండి



హక్కుగా రావాల్సిన నీటిని విడుదల చేయాలని కోరిన సందర్భాల్లో తెలంగాణ నాయకులు విమర్శలు చేస్తున్నారు. ఇరుప్రాంతాల రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సాగునీరు విడుదల చేయాలి. కె.ఆర్.ఎం.బిలో దక్షిణ భారతదేశంతో పాటు ఇరు రాష్ట్రాల అధికారులను భాగస్వాములను చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నీటి కేటాయింపులను నిర్ణయించాలి. ఇప్పటివరకు మూడోజోన్ పరిధిలో నాలుగు టీఎంసీల నీరు కూడా రాలేదు. ప్రధాన కాల్వలకు గండ్లు పడినప్పుడు ఉభయరాష్ట్రాల ఉన్నతాధికారులు క్షేత్ర పరిశీలన చేసి యుద్ధప్రాతిపదికన గండ్లను పూడ్చి రైతుల ప్రయోజనాలను కాపాడాలి.

- తుమ్మల లక్ష్మణరావు, వేంపాడు మాజీ డీసీ చైర్మన్



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న మంత్రి మనోహర్, ఎంపీ మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ దుర్గాభవాని, జేసీ ధాత్రిరెడ్డి

మహిళాభ్యున్నతికి కృషి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మంత్రి నాదెండ్ల

ఏలూరు అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : 'నైపుణ్యతతో బాధ్యతాయుతంగా పనిచేసేతత్వం మహిళలకే సాధ్యం. మహిళల స్వీయ ఆర్థికాభివృద్ధి, సంక్షేమం, భద్రతలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందం'టూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఆర్డీఏ, మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి అధికారిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 కార్యా చరణ ప్రణాళిక అమలులో జిల్లా 5వ స్థానంలో ఉందని, దీనిని మూడో స్థానానికి తీసుకెళ్లేందుకు జిల్లా అధికార యంత్రాంగమంతా సమన్వయంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, బలవంతంగా వ్యభిచార రొంపిలోకి నెట్టి వేయబడుతున్న యువతులను నిరోధించి, ఆదుకునేందుకు త్వరలోనే పార్లమెంటులో ప్రైవేటు బిల్లుని ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళల సాధికారతకు తీసుకుంటున్న చర్యలు, వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందుతున్న భద్రతాసాయం, తదితర అంశాలపై జిల్లాసమాచారాన్ని వివరించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ మహిళల విజయం వెనుక పురుషుల ప్రోత్సాహం ఉన్నపుడు ఆ విజయం ఇద్దరికీ చెందడం న్యాయమన్నారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలపై కళాజాత బృందం ప్రదర్శించిన నృత్యరూపకం, విద్యార్థినులు కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళా సంఘాలకు రూ.131.82 కోట్ల విలువగల బ్యాంకు చెక్కులు, టైలరింగ్‌లో ఉచిత శిక్షణను పూర్తి చేసుకున్న వారికి జీవనోపాధి నిమిత్తం కుట్టుమిషన్లను అందజేశారు. మహిళా సంఘాలు, ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ పరిశీలించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నగర మేయర్ నూర్జహాన్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్ దుర్గాభవాని, ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

- హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావు

ఏలూరు క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కేసుల సత్వర పరిష్కారానికి కక్షిదారులు లోక్‌అదాలత్ సేవలు వినియోగించుకోవాలని హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.మన్మథరావు చెప్పారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవా సదన్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా రాజీ కాదగిన కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కక్షిదారులు ఆలోచనా విధానంలో మార్పులు రావాలని, ఒకసారి లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులపై కక్షిదారులు సంతృప్తి చెందకుండా మరల హైకోర్టులో కేసులు ఫైల్ చేస్తున్నారన్నారు. రాజీ కాదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు. జిల్లా కోర్టులలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శాశ్వత లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారని, ఇవి పని దినాల్లో ఉదయం 10.30 నిముషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులలో బీమా సంస్థ నుంచి రూ.26 లక్షల పరిహారం చెక్కును కక్షిదారులకు అందించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్ కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, రెండవ అదనపు జిల్లా జడ్జి పి. మంగాకుమారి, పోక్సో స్పెషల్ జడ్జి ఎస్.ఉమా సునంద, ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, 7వ అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ, అదనపు సివిల్ జడ్జి పీఎస్‌వీటీ కృష్ణ సాయితేజ, స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి ఎండీ అబుతాలిబ్ పర్వీజ్ షేక్ ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ మన్మథరావును జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్‌కుమార్ సన్మానించారు.

5,368 కేసులు పరిష్కారం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌తో 5,368 కేసులను పరిష్కరించినట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించగా 155 సివిల్ కేసులు, 162 వాహన ప్రమాద బీమా కేసులు, 4,919 క్రిమినల్ కేసులు, 132 ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ చేసినట్టు తెలిపారు.



లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులో అవార్డును అందిస్తున్న జస్టిస్ మన్మథరావు



ఆచంటలో జైన్ ఆలయంలో పూజలు

ఆచంటలో నేడు జైన్ మందిర ప్రతిష్ఠ

ఆచంట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆచంటలో నూతనంగా నిర్మించిన శ్రీ రాజేంద్ర సూరీశ్వరీజీ గురు ధ్యాన జైన్ మందిరం ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఉదయం జరగనుంది. ఈ నేపథ్యంలో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన జైన్ భక్తులు, జైన్ గురువులచే శనివారం గ్రామ పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. జైన్ మందిరంలో పూజాధికాలు నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి జైన్ ట్రస్టు చైర్మన్ అజిత్ కుమార్ జైన్, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కాగా జైనుల రాకతో ఆచంటకు వెలుగు వచ్చిందని జైనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం ఆచంటలో జరిగిన మండల పరిషత్ సమావేశంలో పితాని మాట్లాడుతూ ఆచంట మదన గోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న జైనుల 23 తీర్థంకుడు అయిన పార్శ్వనాథుని విగ్రహాన్ని ప్రభుత్వ ఆదేశాలు, గ్రామస్థులు, అఖిల పక్షం సభ్యుల అంగీకారంతో ఆదివారం జైనులకు అప్పగించనున్నట్టు తెలిపారు.



ఆచంటలో జైన్ ఊరేగింపు



పెదవేగిలో క్వారీగా మారిన పంట పొలం

మట్టి దందా!

- క్వారీలుగా మారుతున్న పంట పొలాలు
- ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్న కాంట్రాక్టర్లు
- నిబంధనలకు పాతర

పెదవేగి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కొంతమంది స్వార్థం పుడమి తల్లికి శాపంగా మారింది. పచ్చని పంటపొలాలు క్వారీలుగా మారి, ప్రమాదకర గోతులుగా మారుతున్నాయి. లాభాలను తెచ్చిపెడుతున్నాయని మట్టి మాఫియా పచ్చని పంట పొలాలను గోతులుగా మార్చేస్తున్నారు. పెదవేగి మండలంలో పలు గ్రామాల్లో పంటపొలాలు భారీ గోతులతో ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. గ్రావెల్‌కు డిమాండ్ ఉండడంతో అవకాశం దక్కించుకున్న వారు నిబంధనలను పట్టించుకోకుండా పంట పొలాలను తవ్వేస్తున్నారు. రెవెన్యూ, గనులశాఖల నుంచి అనుమతులను సక్రమంగా తీసుకోకుండా తవ్వకాలు చేపడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఏవో రసీదులు చూపించి మభ్య పెడుతున్నారు. పెదవేగి, న్యాయంపల్లి, రాయన్నపాలెం, జగన్నాథపురం, గార్లమడుగు తదితర గ్రామాల్లో పంటపొలాలు గ్రావెల్ క్వారీలుగా మారుతున్నా సంబంధిత శాఖాధికారులు ఏమీ తెలియనట్టు మిన్నకుండి పోతున్నారు. పరిమితికి మించిన గ్రావెల్ లోడుతో టిప్పర్లు నిత్యం తిరుగుతూనే ఉన్నా, అరికట్టాల్సిన అధికారులు యోగనిద్రను పాటిస్తున్నారు. అధిక లోడు కారణంగా రహదారులు ధ్వంసమవుతున్నాయి, వాహన దారులకు ప్రాణసంకటంగా మారాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నా, వారిది అరణ్యరోదనగానే మిగిలిపోతోంది. ప్రమాదకర రహదారి మార్జిన్ కారణంగా ఇటీవల పెదవేగి సమీపంలో ద్విచక్ర వాహనదారుడు మృత్యువాత పడ్డాడు. దీంతో కదలిక వచ్చిన మట్టి మాఫియా తూతూ మంత్రంగా కొంతమేర నాసిరకం గ్రామెన్‌ను వేసి మమ అనిపించారు. అంతేతప్ప పూర్తిస్థాయిలో తీసుకున్న చర్యలు శూన్యమే. గ్రావెల్ తవ్వకాలతో తమ పంటపొలాలు నీటిని నిల్వచేసుకునే సామర్థ్యాన్ని కోల్పోతున్నాయని, గతంలో కంటే మరింత ఎక్కువగా నీటి తడులు ఇవ్వాల్సి వస్తోందని సమీపంలోని పంటపొలాల రైతులు వాపోతున్నారు.



న్యాయంపల్లిలో క్వారీ

సా..గుతున్న కంప్యూటరీకరణ

- ముగిసిన డెడ్‌లైన్!
- సహకార సంఘాల అధికారులు మల్లగుల్లాలు
- నెలాఖరుకు పూర్తి చేయడం కష్టమే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సహకార సంఘాల కంప్యూటరీకరణ ఇంకా గాడిన పడలేదు. ఓ పక్క కొండలా పేరుకు పోయిన రుణాల వసూళ్లతో ఈ కార్యక్రమం తిరోగమనంలో పడింది. మార్చి 7వ తేదీ నాటికి ఆన్‌లైన్ సేవలను ప్రారంభించాలన్న ఆ శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు విధించిన డెడ్‌లైన్ అధికారికంగా ముగిసింది. దీంతో ఆన్‌లైన్ లావాదేవీలను సునాయాసంగా చేసేద్దామన్న అధికారులకు ఈ పరిమాణం మింగుడు పడడం లేదు. ఓ పక్క రుణాల వసూళ్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయకపోతే.. కేంద్ర బ్యాంకు నష్టాల తగ్గింపు కష్టమవుతుంది. జిల్లాలో 158 సహకార సంఘాల కంప్యూటరీకరణకు రూ.6 కోట్ల వ్యయంతో గత ఆగస్టులో ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలో పూర్తయ్యే తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో గ్రామాల్లో సొసైటీల కంప్యూటరీకరణ మరుగున పడింది. ఎక్కడా కనీసం పాత బిల్లులు, రికార్డులు అప్‌డేట్ కాలేదని సమాచారం. దాదాపుగా నెలా పది రోజులపైన కోడ్ ఉండడం, సొసైటీల్లో గుమస్తాలు, డివిజన్ల అధికారుల పర్యవేక్షణ లేమితో ఈ కార్యక్రమం మరుగున పడింది. చాలా సొసైటీల్లో 50 శాతం పాత రికార్డులు అప్‌డేట్ కాలేదు. కొన్నిచోట్ల 20 నుంచి 40 శాతం కూడా చేయలేక పోయారు. కొన్ని రికార్డులను కంప్యూటరీకరణ చేయలేక, సాఫ్ట్‌వేర్ సహకారం లేక ఈ ప్రక్రియకు గండంగా మారింది. ఈ నెలలో వరుస సెలవులు రావడతో ఈ నెలాఖరు నాటికి ఆన్‌లైన్ లావాదేవీలు చేయడం కష్టతరమే.

మళ్లీ గ్రామాల బాట..

సహకార సంఘాల కంప్యూటరీకరణను ఒక కొలిక్కి తీసుకురావాలంటే జిల్లా స్థాయిలోను జిల్లా సహకారశాఖాధికారి, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారులు గ్రామాల బాట పట్టి సొసైటీల్లో పర్యవేక్షణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత రికార్డులను, బిల్లులను పూర్తిస్థాయిలో 11 రకాల పత్రాలను అప్‌డేట్ చేయకపోతే, కొత్త బిల్లులు, లావాదేవీలు ఎంట్రీలు కష్టమే. ఇప్పటికే డెడ్‌లైన్ ముగియగా, కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యేలోగా పాత రికార్డుల అప్‌డేట్ చేయకపోతే సర్వర్‌లు ముందుకు కదలవు. దీంతో జిల్లా స్థాయిలో డీసీసీబీ బ్యాంకు అధికారులు, మేనేజర్లు ఈ వ్యవహారంతో తలలు పట్టుకుంటున్నారు. తాజాగా కొత్తగా విధుల్లో చేరిన డీసీసీబీ సీఈవో సింహాచలం సైతం మేనేజర్లు, గుమస్తాలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా జిల్లా డీసీసీబీ, డీసీఎంఎస్‌కు బడ్జెట్‌లపై మహాజన సభలను నిర్వహించాల్సి ఉంది. దీనిపైనా మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ రెండింటికి పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ ధాత్రిరెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈమె కూడా ఈ కార్యక్రమాలపై దృష్టి సారించారు. డెడ్‌లైన్ ముగిసిన విషయంపై జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఇది వాస్తవమేనని, లోపాలు ఎక్కడ తలెత్తెయో సరిదిద్ది, కంప్యూటరీకరణ పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.



బాత్రూంలో డెలివరీపై డీసీహెచ్‌ఎస్ విచారణ
బాలిక అదృశ్యం..12 గంటల్లో ఛేదించిన పోలీసులు
7



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అమెరికన్ మ్యాన్‌హంట్	డాక్యూ సిరీస్	మార్చి 10
అమెజాన్ ప్రైమ్		
వీల్ ఆఫ్ టైమ్ 3	వెబ్‌సిరీస్	మార్చి 13
బీ హ్యాపీ	హిందీ చిత్రం	మార్చి 14
జీ5		
ఇన్ గలియోంమే	హిందీ చిత్రం	మార్చి 14
ఆపిల్ టీవీ ప్లస్		
డోప్ థీఫ్	వెబ్‌సిరీస్	మార్చి 14
ఈటీవి విన్		
పరాక్రమం	తెలుగు చిత్రం	మార్చి 13
రామం రాఘవం	తెలుగు చిత్రం	మార్చి 14
సోనీ లివ్		
ఏజెంట్	తెలుగు చిత్రం	మార్చి 14

కూతురు కోసం తండ్రి తపన

దేశంలోని అతిపెద్ద డ్యాన్స్ రియాలిటీ షోలో ప్రదర్శన ఇవ్వాలన్న కూతురి కోరికను తీర్చేందుకు ఓ తండ్రి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'బీ హ్యాపీ'. అభిషేక్‌బచ్చన్ శివ అనే అంకిత భావం గల తండ్రి పాత్రను పోషించారు. ఇనాయత్ వర్మ ఆయన కూతురు ధార పాత్రలో కనిపించనుంది. డాన్స్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. తల్లి లేని లోటు తెలియకుండా అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురి కోరికను తీర్చేందుకు తపించే తండ్రి పాత్రలో అభిషేక్ నటన ఈ సినిమాకు ప్రధానాకర్షణ అని ట్రైలర్‌ను బట్టి



తెలుస్తోంది. తండ్రీ, కూతురు కలసి ముంబై వెళ్లడం, అక్కడ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు వారు చేసే ప్రయత్నాల్లోంచి పుట్టే వినోదం అలరిస్తుంది. ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకత్వం వహించగా, సల్మాన్‌ఖాన్, ఇమ్రాన్ మజూర్ నిర్మించారు.

వేసవిలో పిల్లలకు ఇవి తినిపించాలి..!

వేసవికాలంలో పిల్లలకు బలవర్ధకమైన పోషకాహారం అత్యవసరం. పెరుగుతున్న ఎండవేడిని తట్టుకునేలా సమయానుసారం పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలో తెలుసుకుందాం.

- ఎండ వేడిమి వల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు తరచూ పిల్లల చేత చల్లని నీరు తాగిస్తూ ఉండాలి. ఫ్రిజ్ కంటే కుండలోని నీళ్ల ఆరోగ్యానికి మంచివి.
- మధ్యాహ్న సమయంలో పలుచని మజ్జిగ, కొబ్బరి నీళ్ల, పండ్ల రసాలు, నిమ్మరసం, రాగి జావ, బార్లీ నీళ్ల తాగించాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల జోలికి వెళ్లనీయకూడదు.
- సబ్జా గింజలు లేదా చియా గింజలను నీళ్లలో నానబెట్టి వాటిని పండ్ల రసాలు లేదా చల్లని మజ్జిగలో కలిపి పిల్లలకు తాగించవచ్చు. సగ్గుబియ్యంతో తయారు చేసే జావ కూడా వేసవి తాపాన్ని హరిస్తుంది.
- పుచ్చకాయ, కర్బూజా, బొప్పాయి, నారింజ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, మామిడి లాంటి తాజా పండ్లను పిల్లలకు తినిపించాలి. కీరా ముక్కలు, తాటి ముంజలు కూడా మేలు చేస్తాయి.
- పాలకూర, టమాటా, కేరట్, బీట్‌రూట్, సొరకాయ, బీరకాయ లాంటి కూరగాయలతో చేసిన వంటలను భోజనంలో చేర్చాలి.
- తాజా కూరగాయలు, పండ్లతో సలాడ్స్, స్మూతీలు తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, దోశ, పెసరట్టు, పోహా లాంటి తేలికగా జీర్ణమయ్యేవాటిని తినిపించాలి. మధ్యాహ్న భోజనంలో రకరకాల కూరగాయలతో తయారు చేసిన సాంబార్, మజ్జిగ ఉండేలా చూడాలి. వీటివల్ల పిల్లలకు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో నీటిశాతం నిలిచి ఉంటుంది. రాత్రి భోజనంలో ఆరోగ్యకరమైన సూప్‌ని చేర్చాలి. సాధ్యమైనంతవరకూ నూనె, మసాలా పదార్థాలను పిల్లలకు పెట్టకపోవడమే మంచిది.
- సాయంకాలం పిల్లలు ఆకలి అన్నప్పుడు కొన్ని డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, మొలకలు, తేనె కలిపిన పండ్ల ముక్కలు తినిపించవచ్చు.



'భంభం భోలే...' అంటూ ఖంగుమని మోగే కంచుకంఠం కైలాష్ ఖేర్‌ది! 'జేజమ్మ...', 'వచ్చాడయ్యా సామి...', 'కథానాయక...' లాంటి పాటలతో తెలుగువారికి దగ్గరయిన కైలేష్ ఖేర్ 19 భాషల్లో తన గానాన్ని వినిపిస్తున్నారు. ఆయన ఆత్మకథ 'తేరీ దివానీ' ఇటీవల విడుదలయింది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ...

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం





చాలా మంది జీవితంలో చివరి దశలోనే ఆత్మకథలు రాస్తారు... మీరు ఇప్పుడే రాయటానికి కారణాలేమిటి?

నా ఉద్దేశంలో ప్రతి వ్యక్తి జీవితం ఒక అందమైన కథ. దీనిలో అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవి కూడా మనల్ని అభిమానించేవారికి తెలియాలి. అయితే ఈ పార్శ్వాలను ఎంత జాగ్రత్తగా, ఎంత నిబద్ధతతో వారి దగ్గరకు తీసుకువెళ్తున్నామనేది ముఖ్యం. దీనికి మాధ్యమంగా నేను పుస్తకాన్ని ఎంచుకున్నాను. ఇక నా జీవితం సంగీతంతో ముడిపడి ఉంది. అందరికీ నేను ఒక గాయకుడిగా మాత్రమే తెలుసు. చాలాకాలంగా నా అభిమానులు నా దగ్గరకు వచ్చి "మీ పాటలు మా హృదయాన్ని తాకుతాయి. మీరు మనసు పెట్టి పాడతారు. అలా పాడటానికి వెనుక ఉన్న కారణాలేమిటి?" అని అడుగుతూ ఉంటారు. వారి కోసమే 'తేరీ దివానీ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను. ఒక సామాన్యుడు అసామాన్య కళాకారుడిగా ఎలా రూపుదిద్దుకున్నాడన్నదే ఈ పుస్తక కథ. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఈ పుస్తక ప్రచురణకర్తల్లో నేను కూడా ఒకడిని. ఎందుకంటే - మంచి పుస్తకాలు అందరి దగ్గరకు వెళ్లాలనేదే నా కోరిక. అందుకే కైలాస ఎడ్వర్‌టైజింగ్ అనే సంస్థను ఏర్పాటు చేసి 'పెంగ్విన్' సంస్థతో కలిపి ఈ పుస్తకాన్ని ప్రచురించాం.

పుస్తక రచన సమయంలో మీ అనుభవాలేమిటి?

మనం ప్రపంచాన్ని ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. ఒక ఏనుగును నలుగురు అంధులు వేరు వేరుగా చూస్తారు. వారి వారి అనుభవాలు వారికి ఉంటాయి. మనం కూడా అంతే. మనకు తెలిసిందే ప్రపంచం అనుకుంటాం. కానీ ఈ పుస్తకం రాసేటప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. ఆ సమయంలో కైలాష్ కేర్ పైకి కనిపిస్తాడు. కానీ వాడి చేత రాయించేవాడు ఈశుడే! ఈ విషయం నాకు పుస్తకం రాసే సమయంలో అర్థమయింది. ఆ సమయంలో నాకు ఒక మిత్రుడు సహకరిస్తున్నాడు. ఒక రోజు మేమిద్దరం కలుసుకోవాల్సి ఉంది. కానీ తను నాకు ఫోన్ చేసి- "నేను రాలేను" అని చెప్పాడు. ఎందుకో అప్పుడు నాకు - 'క్యా సజనా... బిన్ సజనా..' అనే రెండు మాటలు అప్రయత్నంగా వచ్చాయి. ఆ మాటల నుంచి అప్రయత్నంగా పాట పుట్టుకువచ్చింది. ఆ పాటను త్వరలోనే విడుదల చేయబోతున్నాం. ఇలాంటి అనుభవాలెన్నో.

మీ ఆలోచనలు సంగీతంలో ఉంటాయా? మాటల్లో ఉంటాయా?

నేను దేన్నీ ఆలోచించను. మనసులో వచ్చిన ఆలోచనలను ఎప్పటికప్పుడు మాటల రూపంలో పెడతానంతే! మాట్లాడినప్పుడు కూడా అంతే! అందుకే నా మాటల్లో స్పష్టత ఉంటుంది. మాటలు నది మాదిరిగా ప్రవహిస్తూ ఉంటాయి.

మన దేశంలో సినిమా సంగీతానికి ఉన్న ప్రాధాన్యత దేశీయ సంగీతానికి ఉందని మీరు అనుకుంటున్నారా?

మన దేశంలో సినిమా పాటలకు ఆదరణ ఎక్కువ. కానీ దేశీ సంగీతానికి కూడా స్థానికంగా చాలా ప్రాధాన్యం ఉంటుంది. మన దేశంలో ప్రతి ప్రాంతానికి ఒకో ప్రత్యేకత ఉంది. అక్కడ ఉన్న సంగీతం ఇతరులు కూడా విన్నప్పుడు దానిలో ఉన్న గొప్పదనం అర్థమవుతుంది. నేను గత పదేళ్లగా 'భారత్‌కా అమృత్ కలశ్' అనే రియాలిటీ షో నిర్వహిస్తున్నాను. దీనిలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి వారి వేష భాషల్లో వచ్చి పాటలు పాడతారు. ఛానల్స్‌లో కూడా ఇలాంటి షోలు రావాలి. లేకపోతే వాళ్ల రియాలిటీ షోలకు 'ఫిల్మీ రియాలిటీ షో' అని పేరు పెట్టుకోవాలి.

మీతో కలిసి ఆల్బమ్స్ చేయటానికి చాలామంది ఔత్సాహికులు వస్తూ ఉంటారు.. వారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం. అంటే చాలా కష్టం తర్వాతే విజయం లభిస్తుంది. దానివల్ల ప్రసిద్ధులమవుతాం. కానీ ఈ మధ్యకాలంలో సులభంగా ప్రసిద్ధి చెందాలనే ఆలోచన చాలామందిలో కనిపిస్తోంది. మనల్ని ఇష్టపడే అభిమానుల సంఖ్య క్రమంగా పెరగాలి. అంతేతప్ప ఒకేసారి లక్షలమంది రావాలనుకోకూడదు. ఒక పాట హిట్ అయిన వెంటనే ప్రపంచాన్ని జయించామని అనుకోకూడదు.

కైలాష్ ఖేర్ ఎప్పుడూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ కనిపిస్తారు. శుద్ధమైన హిందీలో మాట్లాడతారు. అందుకు కారణమేదైనా ఉందా?

గత కొద్దికాలంగా నేను మాట్లాడే భాషలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు నేను మామూలుగా మాట్లాడేవాడిని. ఇప్పుడు శుద్ధంగా మాట్లాడటం నేను నేర్చుకున్నాను. నేను పాటలు పాడటం మొదలుపెట్టినప్పుడు నాకు ఏమీ తెలీదు. సినిమా పాటలు, 'చిత్రహార్' లాంటివి తెలీదు. టీవీలో షోలు కూడాఎప్పుడూ చూడలేదు. అలాంటి నేను ఇప్పుడు 19 భాషల్లో పాడుతున్నానంటే ఏదో ఒక కారణం ఉండాలి కదా! ఆ కారణం ఆధ్యాత్మికత. నా ఉద్దేశంలో ఆధ్యాత్మికత లేకపోతే భారత దేశం లేదు. ఇంగ్లీషు సంస్కృతి నాలుగైదు వందల సంవత్సరాల క్రితం వచ్చిందే. అంతకుముందు నుంచి 'బతుకు...బతకనివ్వు' అనేది మన సంస్కృతి. 'అందరూ బావుండాలి... అందులో మనం ఉండాలి' అనేది మన సంస్కృతి. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రపంచంలో అందరూ యంత్రాలు తయారుచేస్తున్న సమయంలో మనం మంత్రాలు జపించేవాళ్లం. వాళ్ల యంత్రాలు తయారుచేసి పిచ్చి వాళ్లు అయిపోయారు. ఇప్పుడు వారు మానసిక ప్రశాంతత కోసం మన దగ్గరకు వస్తారు. అంటే మన సంస్కృతి అంత గొప్పది. అలాంటి భావనను నేను ఎప్పుడూ వదలను. కైలాష్ కేర్ ఎప్పుడూ మారడు. ఆధ్యాత్మికతను వదలడు.

- సివిఎల్ఎన్ ప్రసాద్



కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

వెండితెర ఎంట్రీ దక్కాలంటే ఆషామాషీ విషయం కాదు. అలాంటిది ఇండస్ట్రీనే ఎర్రతివాచీ వేసి ఆహ్వానిస్తే ఎలా ఉంటుంది. పరిశ్రమలో నటీనటుల వారసుల పరిచయానికి ఉండే క్రేజే వేరు. కొత్తగా వచ్చే వారసులకు తమ తల్లిదండ్రుల అభిమానుల ఆదరణ కూడా విశేషంగా ఉంటుంది. అలా వెండితెర ఎంట్రీ ఇస్తున్న కొత్త తరంపై ఓ లుక్కేద్దాం.

వారసులు వచ్చేస్తున్నారు...





ఎన్టీఆర్ నటవారసత్వాన్ని నందమూరి బాలకృష్ణ అందుకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ కుటుంబం నుంచి మూడు తరాల నటులు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. తాజాగా, ఆ కుటుంబం నుంచి నాలుగో తరానికి చెందిన ఇద్దరు నూతన కథానాయకులు చిత్రసీమను పలకరించనున్నారు. అందులో ఒకరు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కాగా, మరోకరు హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు తారకరామారావు. కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇది ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో సూపర్ హీరో కథాంశంతో తెరకెక్కనుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీని తర్వాత తన తండ్రి బాలకృష్ణ దర్శకత్వంలో 'ఆదిత్య 999 మ్యాక్స్' చిత్రంలో మోక్షజ్ఞ నటించనున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అలాగే, "సార్', 'లక్కీ భాస్కర్' చిత్రాలతో సూపర్‌హిట్‌లు అందుకొన్న వెంకీ అట్లూరీ కూడా మోక్షజ్ఞ కోసం ఓ కథ తయారుచేశారట. నట వారసులను, కొత్తతరాన్ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుంటారు దర్శకులు వైవీఎస్ చౌదరి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఓ సినిమాలో జానకీరామ్ తనయుడు తారకరామారావు కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రకటించడంతో పాటు తారకరామారావు లుక్‌ను విడుదల చేశారు. ఇందులో కథానాయికగా వీణా రావు నటిస్తున్నారు. ఈ ఏడాదే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



మరో మేనల్లుడు సిద్ధం

ఘట్టమనేని కుటుంబం నుంచి తెరంగేట్రం చేసేందుకు మరో వారసుడు సిద్ధమయ్యారు. మహేశ్‌బాబు అల్లుడిగా ఇప్పటికే అశోక్ గల్లా 'హీరో' సినిమాతో పరిచయమై ప్రేక్షకులను మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అశోక్ తమ్ముడు సిద్ధార్థ్ గల్లా కూడా సిల్వర్‌స్క్రీన్ వైపు అడుగులేస్తున్నారు. రచయిత గోపీ మోహన్ దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. అలాగే, మహేశ్‌బాబు అన్న కుమారుడు రమేశ్‌బాబు తనయుడు కూడా వెండితెరపై అలరించేందుకు ముస్తాబవుతున్నారు.

బాలనటులుగా

మంచు కుటుంబం నుంచి మూడో తరం వారసులు వెండితెర ఎంట్రీకి రెడీ అయ్యారు. మంచు మోహన్‌బాబు, ఆయన తనయులు విష్ణు, మనోజ్ నటులుగా ఇప్పటికే ఇండస్ట్రీలో ఉన్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాతో ఆయన తనయుడు అవ్రామ్, కుమార్తెలు అరియాన, వివియాన బాలనటులుగా పరిచయం అవుతున్నారు. భారీ తారాగణంతో ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

డియోల్ కుటుంబం నుంచి..



'యానిమల్' సినిమాతో ఫామ్‌లోకి వచ్చారు బాబీ డియోల్. ఆయన కుమారులు ఆర్యమన్ డియోల్, ధరమ్ డియోల్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. తెలుగులో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా 2023లో విడుదలై ఘనవిజయం సాధించిన 'బేబీ' సినిమాను ఆర్యమన్ డియోల్ హీరోగా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో దివంగత నటుడు ఇర్ఫాన్ ఖాన్ తనయుడు బాబిల్ కూడా నటించనున్నట్లు టాక్. హీరోయిన్లుగా సారా అలీఖాన్, క్రితి శెట్టి పేర్లను పరిశీలిస్తున్నారు.

సైఫ్ నటవారసుడు



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ వారసురాలిగా సారా అలీ ఖాన్ ఇప్పటికే సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సైఫ్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. షౌనా గౌతమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నదానియాన్' చిత్రంలో నటించారు. ఇటీవలే ఈ సినిమా విడుదలైంది. ఆయన ప్రస్తుతం కునాల్ దేశ్‌ముఖ్ దర్శకత్వంలో 'దిలెర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.

మెగాఫోన్‌తో...

స్టార్ హీరోల వారసులు ఎక్కువ మంది నటులుగా మారుతుంటే.. వారికి భిన్నమైన దారిలో ప్రయాణిస్తున్న వారూ ఉన్నారు. తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టనున్నారు. సందీప్ కిషన్ హీరోగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ కూడా దర్శకత్వం వైపు అడుగులేస్తున్నారు. 'బా..డ్స్ ఆఫ్ బాలీవుడ్' పేరిట నెట్‌ఫ్లిక్స్ రూపొందిస్తున్న ఈ సెటైరికల్ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ దర్శకుడు. ఇందులో షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు.

యంగ్ పవన్‌గా..

పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ వెండితెరపైకి ఎంట్రీ ఇవ్వకున్నా.. మెగా అభిమానులకు బాగా సుపరిచితమే. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో అకీరా చేసే వీడియో ఎడిట్స్‌ను మెచ్చుకుని మురిసిపోతుంటారు మెగాభిమానులు. ప్రస్తుతం పవన్ కథానాయకుడిగా 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' తెరకెక్కుతోంది. ఇందులో పవన్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో అకీరా మెరవనున్నట్లు టాక్.

నటించే సామర్థ్యంతో పాటు కీబోర్డ్ ప్లేయర్‌గానూ అకీరాకు ప్రవేశముంది. దీంతో ఈ సినిమాలో తమ సంగీత బృందంలో అకీరాను చేర్చుకునే ఆలోచనలో ఉన్నట్లు తమన్ తెలిపారు.



అబలలు కాదు..

మహిళలు అంటే అబల కాదు.. సబల అని చాటి చెప్పారు.. తమ శక్తి ఇదీ చూపించారు. కర్రసాము చేశారు.. కాలుతున్న పెంకులను ఒక్క చేతి దెబ్బతో పగలగొట్టారు.. ఏలూరు సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆత్మరక్షణ విద్యలో భాగంగా విద్యార్థినుల ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. బాల్య వివాహాల వల్ల అనర్థాలపై కళాజాత బృందం ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు.


కర్రసాముకైనా రెడీ


కొండనైనా పిండి చేస్తాం..






మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్


ఆకట్టుకున్న నాటక ప్రదర్శన


కళాకారులను సత్కరించిన కలెక్టర్


ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలో పోలీస్ విశ్రాంతి భవనం నిర్మాణానికి శిలాఫలకం ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, ఎంపీ మహేశ్ యాదవ్ , ఎమ్మెల్యే చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

పోలీస్ సేవలు అభినందనీయం

ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

64.80 లక్షలతో మహిళా పోలీస్ డార్మిటరీకి శంకుస్థాపన

ఏలూరు క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా రక్షణకు రాత్రింబవళ్ళు పనిచేసే పోలీస్ సేవలు అభినందనీయమని ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ కృషితో మహిళా పోలీస్ డార్మెటరీ నిర్మాణం కోసం ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి కేటాయించిన రూ.64.80 లక్షలతో నిర్మించనున్న మహిళా పోలీస్ డార్మిటరీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా పోలీస్ డార్మిటరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఎంపీ మహేష్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఎంపీ నిధులను మంజూరు చేశామన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ డార్మిటరీ నిర్మాణానికి నిధులు కేటాయించిన ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్‌కు మహిళా పోలీసు సిబ్బంది, హోం గార్డులు తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కిషోర్, జేసీ పిధాత్రిరెడ్డి, అడిషనల్ ఎస్పీ సూర్య చంద్రరావు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : ఐజీ అశోక్ కుమార్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. శంకుస్థాపన కార్యక్రమాలు అనంతరం మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలందరికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో ఇప్పటికే 30 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేస్తున్నామని మహిళలు మరింత నైపుణ్యం పెంచుకుని ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో సమానత్వం పొందాలన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో ప్రత్యేక అభయ మహిళా పోలీస్ రక్షక బృందాలు, శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో మహిళా పోలీసులు, హోం గార్డులు 24 గంటలు ఎంతో కష్టపడి బందోబస్తులో పాల్గొంటున్నారని అలాంటి వారికి విశ్రాంతి తీసుకోవడానికి మహిళా దినోత్సవం రోజున పోలీస్ డార్మెటరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. మహిళలకు సంబం ధించిన కేసుల దర్యాప్తు వేగవంతం చేశామన్నారు.

ఆక్వాను ఆదుకోండి

ఆందోళన బాటలో రైతులు

ఆకివీడు జాతీయ రహదారిపై ధర్నా

ఆకివీడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) :మూడేళ్లుగా ఆక్వాకు గడ్డుకాలం నెలకొంది. వాతావరణం సహకరించకపోవడం, ఆదిలోనే తెగుళ్ల విజృంభించడంతో రైతాంగానికి రొయ్యల సాగు కత్తిమీద సాములా మారింది. మేత ధరలు విపరీతంగా పెరగడం, రొయ్యి ధర పతనమవ్వడంతో రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతులు ఆందోళన బాట పట్టారు. ఆకివీడు మండల ఆక్వా రైతులు శనివారం గుమ్ములూరు సెంటర్‌లో 165 జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.కొన్నిచోట్ల ప్రభుత్వానికి అసోసియేషన్ తరపున వినతిపత్రాలు అందజేశారు.

సబ్సిడీ అందించాలి

జనవరి నెల వచ్చే సరికి చెరువులు కళకళలాడేవి. గతేడాది, ఈ ఏడాదిలో ఖాళీ చెరువులు కనబడుతున్నాయి. నష్టాల భయంతో పెట్టుబడులు పెట్టలేక ఖాళీగా వదిలేశారు. 120 కౌంటులో తెగుళ్ల రావడంతో పట్టుబడి పట్టేయాల్సి వస్తుంది. ఈ మధ్య కాలంలో 100 కౌంటు దాటిన దాఖలాలు లేవు. గతంలో లీజు రూ.1.30 లక్షల్లో ఉండగా సాగు దిగుబడులు లేకపోవడంతో లీజులు రూ.80 వేలు వరకూ పడిపోయాయి.ప్రతీ కౌంటుకు సుమారు రూ.25 పైబడి గిట్టుబాటు ధర ఉంటే రైతులు నష్టపోరు. మేతలు, మందులు ధరలు తగ్గించడంతో పాటు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ కల్పించితే సాగు కొనసాగిస్తారు.

• గిట్టుబాటు ధర ఉండడం లేదు



రేయింబవళ్లు కష్టపడి నాలుగైదు నెలలు పండించిన రొయ్యలకు కంపెనీల వారు రేట్లు తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఆక్వా మేతల ముడిసరుకు రేట్లు యాభై శాతం తగ్గినప్పటికీ మేతలు, మందుల రేట్లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దోపిడీకి గురవుతున్నాం.

- ముప్పానేని నాగేశ్వరరావు, సర్పంచ్, తరటావ

• సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారు



ఆక్వాజోన్‌లో రొయ్యల సాగు బాగానే జరుగుతున్నది. రొయ్యల ఎగుమతి కంపెనీదారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో కిలోకి రూ.50 వరకూ తగ్గించారు. తప్పని పరిస్థితుల్లో సరుకును తక్కువ రేట్లుకు కంపెనీల వాళ్ళకు ఇవ్వవలసి వస్తుంది.

- ముద్దే విశ్వేశ్వరరావు, సర్పంచ్, దుంపగడప

• గత ప్రభుత్వ తప్పిదాలతో ఇబ్బందులు



మేతలు, మందుల కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో దోపిడీకి గురవుతున్నాం. గత ప్రభుత్వ తప్పిదాలతో నేడు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వాలు కనీస మద్దతు ధర నిర్ణయించడం లేదు. ఎంఆర్పీ నియంత్రణ కూడా చేయడం లేదు. రొయ్యల రైతుల పరిస్థితి కొనబోతే కొరివి, అమ్మబోతే అడివి అన్న చం దంగా తయారైంది. కొనుగోళ్ళు, అమ్మకాలలోను తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

-మోటుపల్లి సుబ్బారావు, డీసీ వైస్ చైర్మన్, ఆకివీడు

• ఉపాధి కోల్పోతున్నారు



గిట్టుబాటు ధర లేకపోవడంతో కొందరు సాగు వదులు కుంటున్నారు. దీంతో వేల మంది రైతులు, లక్షల్లో ఉపాధి పొందుతున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి. వరి మాదిరిగా రొయ్యలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతులు నష్టపోరు. ప్రస్తుతానికి వరిసాగు బాగుండడంతో కొందరు ఆక్వా రైతులు వ్యవసాయం బాట పడుతున్నారు.

మన్రివాడ వెంకట్రావు, ఆక్వా రైతు సంఘం నాయకుడు, చినకాపవరం


ఆకివీడు 165 జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఆక్వా రైతులు


డాక్టర్ పద్మినిని సత్కరిస్తున్న రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి

నిట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం నిట్‌లో మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ చిట్యాల పద్మినిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ పద్మిని, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, ఎస్‌వీఎస్ విభాగాధిపతి డాక్టర్ సౌమ్య జోస్ మాట్లాడుతూ మహిళా విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

చిన వెంకన్న క్షేత్రంలో సాయంకాలార్చన సమయం మార్పు

ద్వారకాతిరుమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సూర్యాస్తమయ కాలానికి అనుగుణంగా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో సాయంకాలార్చన సమయాన్ని ఈనెల 14 నుంచి మార్పు చేస్తున్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ఇప్పటి వరకూ సాయం కాలార్చన సమయం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకూ ఉందన్నారు. దానిని సాయంత్రం 05.30 గంటల నుంచి 7 గంటల వరకు మార్పు చేసినట్లు వివరించారు. సాయంకాలార్చన అనంతరం తిరిగి 7 గంటల నుంచి స్వామిదర్శనం లభిస్తుందని భక్తులు గమనించాలని కోరారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

గోవిందనామాలతో శ్రీవారి క్షేత్రం శనివారం శోభిల్లింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు వచ్చారు. దాదాపు 20 వేల మంది స్వామివారిని దర్శించి ఉంటారని అధికారులు అంచనా. స్వామివారి నిత్యార్జిత కల్యాణంలో దాదాపు 180 వరకూ జంటలు పాల్గొన్నాయి.


ఆలయంలో భక్తులు

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

భీమవరం క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు తెలిపారు. భీమవరం మండలం నాగిడిపాలెం గ్రామానికి చెందిన తిరుమాని రాముడు (52) ఈ నెల 2వ తేదీన సైకిల్‌పై బయటకు వెళుతుండగా కోళ్ళతో వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో అతనిని విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు హెచ్‌సి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండరెడ్డి గ్రామంలో ఇల్లు దగ్ధం

బుట్టాయగూడెం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరుమద్దిగూడెం కొండరెడ్డి గ్రామంలో శనివారం గురుగుంట్ల లక్ష్మీకి చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బాధితురాలు లక్ష్మీ పోలం పనులకు వెళ్ళింది. రూ.10 వేల నగదు, రేషన్, సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితురాలు వాపోయింది.


మద్యం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

రూ.3 లక్షల విలువైన మద్యం స్వాధీనం

తణుకు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : యానాం నుంచి కంతేరుకు అక్రమంగా తరలిస్తున్న రూ. 3 లక్షల విలువైన మద్యం మద్యం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కుమరేశ్వరన్ చెప్పారు. శనివారం సాయంత్రం తణుకు ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ కేసులో ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన కొవ్వూరు వెంకట శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 3 లక్షల విలువగల మద్యం సీసాలతో పాటు కారు స్వాధీనం చేసుకున్నా మన్నారు. సీఐ సత్తి మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బం దితో దాడి చేసి పట్టుకున్నారన్నారు. ఇదే కేసులో వెంకట సత్య నారాయణరెడ్డి అనే భరత్‌రెడ్డి, ప్రేమ్ కుమార్‌లు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందుతుడు శ్రీనివాసరెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రైమ్ కార్నర్

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడిన ఒక వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామానికి చెందిన బొల్లారి పురుషోత్తమ్ (58)కి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలయ్యాయి. మద్యానికి బానిస అయిన పురుషోత్తమ్ తరచుగా భార్యతో గొడవ పడుతున్నాడు. దీంతో అతనిని భార్య, పిల్లలు మందలించారు. తీవ్ర మనస్తాపానికి గురైన అతను శనివారం ఉదయం పొలంలోకి వెళ్ళి పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం..12 గంటల్లో ఛేదించిన పోలీసులు

భీమవరం క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన బాలిక ఆచూకీని భీమవరం టూటౌన్ పోలీసులు 12 గంటల్లోనే ఛేదించారని భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 36వ వార్డుకు చెందిన 11 ఏళ్ల బాలిక ఐదో తరగతి చదువుతోంది. ఇంట్లో వారు ఏదో అన్నారని ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం స్కూల్ బ్యాగ్ తీసుకుని వెళ్లిపోయింది. తల్లిదండ్రులు అన్నిచోట్ల వెతికారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ కాళీచరణ్ వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలోని ప్రతి ఇంటి వారిని రాత్రే నిద్రలేపి విచారణ చేశారు. కొన్నిచోట్ల ఉన్న సీసీ కెమెరాలు ద్వారా బాలిక కదలికలు గుర్తించారు. ఒక నివాసం వద్ద విచారిస్తున్న సమయంలో బాలిక సాయంత్రం ఇటువైపు వచ్చిందని ఫొటో తీయమంటే తీసిందని చెప్పారు. అక్కడ విచారించగా బాలిక టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లినట్లుగా గుర్తించారు. డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలు కూడా వినియోగించారు.


వివరాలు తెలుపుతున్న భీమవరం డీఎస్పీ జయసూర్య

విజయవాడలో ఉన్నట్లు గుర్తింపు

బాలిక రైల్వేస్టేషన్‌కు వెళ్లినట్లుగా తెలియడంతో ఇటు విశాఖ, విజయవాడ, హైదరాబాద్ రైల్వే జీఆర్‌పి పోలీసులను సీఐ అలర్ట్ చేశారు. విజయవాడ జీఆర్‌పీ పోలీసులు ఒక బాలిక అనుమానంగా కనపడటంతో ప్రజ్వల టీమ్ ద్వారా బాలికల వసతి గృహంలో ఉంచినట్లుగా తెలిపడంతో బాలిక ఫొటోలను అక్కడకు పంపించి ఆ బాలికే అని గుర్తించారు. వెంటనే విజయవాడ వెళ్లి బాలికను భీమవరం తీసుకువచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. తల్లిదండ్రులకు, బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ కాళీచరణ్, ఎస్ఐ ఇజ్రాయేల్, హెచ్‌సీ గోవింద్, పీసీలు నరేష్, గోపి,సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం తాగొద్దని భార్య మందలించడంతో ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, (ఏలూరు) మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నిత్యం మద్యం సేవిస్తూ కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్న భర్తను భార్య మందలించడంతో ఆమెను బెదిరించడానికి కలుపు మందు సేవించిన లాగు రవికుమార్ (32) మృతిచెందిన నట్టు లక్కవరం ఏఎస్సై భాస్కర్ తెలిపారు. మండలంలోని నాగులగూడెం గ్రామానికి చెందిన రవికుమార్‌కు సమ్మక్కతో గత ఐదేళ్ళ క్రితం వివాహం జరిగింది.వీరికి ఇద్దరు సంతానం. రవికుమార్ మద్యం సేవిస్తూ తిరుగుతూండడంపై ఈనెల ఏడవ తేదీన భార్య మందలించింది. దీంతో తన భార్యను బెదిరించడానకి కలుపు మందు తెచ్చుకుని అదేరోజు రాత్రి సేవించాడు. అపస్మారస్థితిలోకి వెళ్ళిన రవికుమార్‌ను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుని భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బాత్రూంలో డెలివరీపై డీసీహెచ్‌ఎస్ విచారణ



కైకలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కైకలూరు ప్రభుత్వాసుపత్రి మరుగుదొడ్డిలో ఆడశిశువుకు జన్మనిచ్చి పారిపోయిన తల్లిని కైకలూరు టౌన్ పోలీసులు కనుగొన్నారు. మండలంలో ఓ గ్రామానికి చెందిన యువతిగా గుర్తించి శుక్రవారం అర్ధరాత్రి ఆ యువతి ఆమె తల్లిని కనుగొని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసహాయం అందిస్తున్నారు. ఆ యువ తికి తండ్రి లేకపోవడంతో తల్లి సంరక్షణలో పెరుగు తోంది. తల్లి కూలి పనులు చేసుకుంటూ యువతిని పదో తరగతి వరకు చదివించింది. రెండు సంవత్స రాలుగా ఇంటి వద్దే ఉంటుంది. కొంతకాలంగా తల్లికి తమ్ముడు అయిన కె.గణేశ్‌తో (33) ప్రేమ సంబంధం కొనసాగుతుంది. అతను లారీ డ్రైవర్‌గా పని చేస్తు న్నాడు. ఈ దశలో యువతి గర్భం దాల్చిన విషయాన్ని ఎవరికి బయటకు చెప్పవద్దని చెప్తే చంపేస్తానని గణేశ్ బెదిరించడంతో ఈ విషయాన్ని తల్లికి సైతం తెలియకుండా దాచుకుంటూ వచ్చింది. కడుపునొప్పి వస్తుందని ఈనెల 6వ తేదీ రాత్రి తల్లి మరో బంధువుతో కలిసి కైకలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం బాధితు రాలు బాత్రూంకు వెళ్లగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆ బిడ్డను బాత్రూం కప్‌బోర్డులో పడవేసి తల్లికూతురు పరారయ్యారు.

సీసీ కెమెరాల ఆధారంగా గుర్తింపు

పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగానే యువతిని గుర్తించారు.యువతి ఇంటికి వెళ్లి పోలీసులు వారికి నచ్చజెప్పి డెలీవరీ అయిన తరువాత చికిత్స పొందాలని తల్లిని, కుమార్తెను కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. నిందితుడు గణేశ్‌పై రేప్ కమ్ పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ పి.కృష్ణ తెలిపారు.

12 నుంచి వెంకటాపురంలో దుర్గమ్మ తిరునాళ్లు

కామవరపుకోట, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : రావికంపాడు పంచాయతీ వెంకటాపురం గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయ 74వ వార్షికోత్సవాన్ని ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కోటగిరి విశ్వనాధం తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.గత 73 సంవత్సరాలుగా భక్తిభావాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న దుర్గమ్మ తిరునాళ్ళు ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు.

వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించాలి

పెదపాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. పలువురు వాహనదారులకు ఇ-చలానా రూపంలో జరిమానాలు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అలాగే విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన వాహనదారులకు సూచించారు. తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : హైకోర్టు జడ్జి

ఏలూరు క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని రాష్ట్ర హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.మన్మథరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏలూరు కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాసదన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మహిళా న్యాయమూర్తులను జస్టిస్ మన్మథరావు సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ మహిళలు తల్లిగా, భార్యగా కుటుంబం అభివృద్ధికి ఎంతో సమర్థవంతంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రెండవ అదనపు జిల్లా జడ్జి పి మంగకుమారి, ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, ఫోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఉమా సునంద, ఏలూరు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన, పాలకొల్లు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ లావణ్యలను పూలమొక్కలు అందించి, శాలువాతో సత్కరించారు.

కొవ్వలిలో చంద్రశేఖర జనార్దనరావు సంస్మరణ

దెందులూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వ్యాపారవేత్త వెల్షన్ సంస్థల అధినేత దివంగత వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు సంతాప సభ కొవ్వలిలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారంటూ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు పలువురు ప్రముఖులు వచ్చి జనార్దనరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ద్వారకాతిరుమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో 94 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కోటి రూపాయలను అందజేస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. మండలంలోని ద్వారకాతిరుమల, పంగిడిగూడెం, తిమ్మాపురం, రాళ్లకుంట, కొమ్మర, కోడిగూడెం, జి.కొత్తపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. పేదలందరికీ వైద్యం అందాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

రైతు సంఘాల ఆధ్వర్యంలో 17న కలెక్టరేట్ వద్ద ధర్నా

చింతలపూడి, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : సమగ్రమైన కౌలు రైతుల చట్టం తేవాలని కోరుతూ ఈనెల 17వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య కోరారు. మండలంలోని సమ్మెటవారిగూడెం గ్రామంలో కౌలు రైతుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులకు వడ్డీలేని రుణాలు, ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని, రైతు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలు అమ్ముకునే పరిస్థితిలేదని, కౌలు రైతులకు నూతన చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

దేశీయ కోకో గింజలనే కొనుగోలు చేయాలి

పెదవేగి, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : కోకో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని విదేశాల నుంచి దిగుమతులను నిలుపుదల చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. పెదవేగి మండలం విజయరాయిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోకో రైతుల ప్రాంతీయ సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా కోకో గింజలకు రూ.900ల వరకు ధర పలుకుతుంటే ఇక్కడ మాత్రం రూ.600లకు మించి ధర రావడంలేదన్నారు.ఈ నెల 10న ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బొల్లు రామకృష్ణ, మున్నంగి సుబ్బారెడ్డి, కోనేరు సతీష్, గుడిబండి రమేష్‌రెడ్డి, ఎ.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఆకుమర్తి పుట్టిన రోజు వేడుకలు

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 8(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నారా లోకేశ్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుమర్తి రామారావు పుట్టిన రోజు వేడుకలు శనివారం ఆయన కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామారావు పుట్టినరోజు కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, చేను ప్రసాద్, కరణం రాంబాబు, తదితరులు రామారావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

చెరువుల ధ్వంసంపై తప్పుడు ప్రచారం సరికాదు

ఏలూరు రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : చేపల చెరువు ధ్వంసం విషయంలో అటవీ శాఖ అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని ఈ విషయంలో శ్రీపర్రుకు చెందిన కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పలువురు రైతులు పేర్కొన్నారు. ఏలూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ డబ్బులు ఇచ్చిన వారి చెరువులను ధ్వంసం చేయడం లేదంటూ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అటవీ శాఖ అధికారులు పాటిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సైదు శివకృష్ణ, దుర్గారావు, నేరు రామలక్ష్మణ, సైదు పాపారావు పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్‌లకు దోచిపెట్టొద్దు

పోలవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : దేశ సంపదను పాలకులు సంపన్నులకు దోచిపెడుతున్నారని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు సి.విజయ పేర్కొన్నారు. శనివారం పోలవరం మండలం గుంజవరం గ్రామంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ టి.చిన్ని అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయ మాట్లాడారు. మహిళలు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళల సాంప్రదాయ నృత్యాలు అలరించాయి.

ఉచిత వైద్య శిబిరాలు ప్రశంసనీయం : ఏఎస్పీ

ఏలూరు రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి సేవలందించడం ప్రశంసనీయమని అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు.ఏలూరులోని రామచంద్రరావుపేటలో ఉన్న శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రతినెలా రెండో శనివారం ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీని కలిసిన ఏలూరు డీఈవో

ఏలూరుసిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : జడ్పీ చైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో శనివారం జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్‌ను ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ కలిసి ప్రస్తుతం జరుగుతున్న స్కూల్ క్లస్టర్ రీ ఆర్గనైజేషన్ వివరాలు తెలియజేవారు. క్లస్టర్ రీ ఆర్గనైజేషన్ కొన్ని మెజారిటీ స్కూల్స్ మేనేజ్‌మెంట్ కమిటీలు ప్రస్తుతం జరుగుతున్న రీఆర్గనైజేషన్‌కు మద్దతిచ్చినట్టు తెలిపారు. అనంతరం పద్మశ్రీప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మరింతగా మెరుగుపడతాయని అన్నారు. భవిష్యత్తులో అన్ని రాష్ట్రాలకు ఏపీ మార్గదర్శకాలు ఆదర్శనీయంగా ఉండాలని ఆశించారు.

మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలి

బుట్టాయగూడెం, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సమీపంలోని అల్లి కాలువ వద్ద నిర్మాణంలో ఉన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని త్వరగా పూర్తి చేసి ఆదివాసీలకు అందుబాటులో తీసుకురావాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి, మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ ఆసుపత్రిని సందర్శించారు. త్వరితగతిన నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలోజు నాగేశ్వరావు, పొడియం భీమరాజు, కూరం సత్యనారాయణదొర, చుండ్రు బుల్లెమ్మ, వెంకటలక్ష్మీ, ఎం.రాము, సోయం శ్రీనివాస్ పాల్గొన్నారు.

12న జరిగే మహాధర్నాను జయప్రదం చేయండి

పెదవేగి, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12న మహా ధర్నా చేపట్టామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి పిలుపునిచ్చారు. పెదవేగి మండలం అమ్మపాలెంలో ఉపాధి పనిలో కూలీలను శనివారం కలిసిన రవి, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత అవస్థలు పడుతోందని, దీంతో వలసలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వలసలు నివారించి, ఉపాధి హామీ పథకం పనిదినాలు 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్‌లో ఉత్తమ సేవా పత్రాల అందజేత

ఏలూరు/అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) :అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తమ సేవాపత్రం అందజేసి శనివారం అభినందించారు. ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పెనుమాల శ్రీదేవి, డీఈవో వెంకట లక్ష్మమ్మ, జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణిలు ప్రశంసా పత్రాలను అందుకోగా డీఎంహెచ్‌వో ఆర్.మాలిని సత్కరించారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకి సన్మానం | పి.శారద | వెంకట లక్ష్మమ్మ | కె.అనూరాధ | శ్రీలక్ష్మి



కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసిన ఎమ్మెల్యే | ఆర్.వి.నాగరాణికి సత్కారం | సరిపల్లి సుందరికి సత్కారం

అన్నింటా తానై..

- ఘనంగా మహిళా దినోత్సవం
- ఉత్తమ సేవకులకు కలెక్టర్ సత్కారం
- ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో మహిళలకు చిరు సత్కారాలు



▸ దివ్యాంగ బిడ్డలకు అన్నీ తానై..

దెందులూరు : దెందులూరు మండలం కొవ్వలిలోని రాజుల పేటకు చెందిన సమాజ శ్రేయస్సు సంస్థ సభ్యులు మహిళా దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. 30 ఏళ్లుగా మంచానికే పరిమితమైన దివ్యాంగ బిడ్డలకు సేవలందిస్తున్న తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో కె. మమత, జాన్సీ ఉమాదేవి, జి.సీతారావమ్మ, మాధూరి, వి.శివకుమారి పాల్గొని 12మంది తల్లులను సన్మానించారు.



▸ రక్తదానం చేసిన మెడికోలు

ఏలూరు క్రైం :ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో మెడికోలు రక్తదానం చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, ఏలూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారిణి పి.సంధ్య పాల్గొన్నారు.

● లింగపాలెం : మండలం ములగలంపాడు గ్రామానికి చెందిన సరిపల్లి సుందరి అనే మహిళ ప్రభుత్వ రుణాలతో ఫొటోస్టూడియో విజయవంతంగా నడపడంతో కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

▸ 58 మందికి మేఘలాదేవి సన్మానం

కొయ్యలగూడెం : మండలం రాజవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఏలేటి చినతుక్కయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 58 మంది మహిళా ఉద్యోగులకు ప్రసంశాపత్రాలిచ్చి సన్మానించారు. కొయ్యలగూడెంలో టీడీపీ నాయకురాలు మేఘలాదేవి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

● పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో అనురాధ మాట్లాడుతూ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే స్వావలంబన సాధ్యపడుతుందని అన్నారు. అనంతరం డీపీవో అనూరాధ, దుగ్గిరాల గ్రామ సర్పంచ్ క్రీస్తుమణి, ఇతర మహిళా వైద్యులను కళాశాల తరపున ఘనంగా సత్కరించారు.

▸ విద్యతోనే మహిళా సాధికారత

ఏలూరు టూటౌన్ : విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి మీనామహాలక్ష్మి అన్నారు. 3వ డివిజన్‌లో మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ మహిళాభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యురాలు జాలా సుమతి బాలాజీ, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ, సి.హెచ్.వెంకట రమణ, వనిత, సుల్తాన బేగం, ప్రసన్న పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల : త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రవేశపెడుతున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో శనివారం అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళల సంక్షేమానికి చంద్రబాబు,లోకేష్, పవన్ కల్యాణ్‌లు ఏం చేస్తున్నారో వివరించారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

▸ 50 మంది మహిళలకు సత్కారం

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి8(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం టీడీపీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 50 మంది మహిళలకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్, రాజాన పండు మహిళల గొప్పదనాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ మహిళా నాయకులు పగడం సౌభాగ్యవతి, పి.రామలక్ష్మి, మారిశెట్టి బాల చిట్టెమ్మ, గుళ్ళపూడి శ్రీదేవి, రాజీ, కోటగిరి ప్రమీల, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి తూటిగుంట రాము, మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం పద్మావతి

●బుట్టాయగూడెం :బుట్టాయగూడెంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఏపీఎం ఎస్‌వీవీ పద్మావతి పాల్గొని మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు, సిఐటియు, గిరిజన, మహిళా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కారం దారయ్య, ఎం.నాగమణి,చుండ్రు బుల్లెమ్మ పాల్గొన్నారు.

● చింతలపూడిలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవత సంస్థ ఆధ్వర్యంలో కమిషనర్ డి.పావనిని శాలువా కప్పి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. టీడీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి బోడా నాగభూషణం, తహసీల్దార్ ప్రమద్వర, డిటి షకీలున్నీసా, ఆర్ఐలను సన్మానించారు.





మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకురాలు మేఘలాదేవి సత్కరించిన దృశ్యం



మహిళలను సన్మానిస్తున్న ఘంటా మురళీ

▸ మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ సన్మానం

కామవరపుకోట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ తన స్వగృహంలో పలువురు మహిళలను టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ అధ్యక్షతన సన్మానించారు.. అదేవిధంగా ఆడమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గూడపాటి కేశవరావు, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జిజ్జూరి బాబ్జీ మహిళలను సత్కరించారు.

సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగుల వినూత్న నిరసన

ఏలూరు అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం స్థానిక ఎస్ఎస్ఏ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సత్కరించారు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ నిరసన కార్యక్రమాలు, ఆందోళన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగుల సమాఖ్య జేఏసీ జిల్లా అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ ప్రదేశాల్లో, కార్యాలయాల్లో మహిళలపై జరుగుతున్న అన్నిరకాల హింసలను అరికట్టేందుకు కఠిన చట్టాలు చేయాలని, మహిళా ఉద్యోగులకు కార్యాలయాల్లో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సమాఖ్య జేఏసీ మహిళా కార్యదర్శి కె.రాజ్యలక్ష్మి, కోశాదికారి భగవాన్ ఆధ్వర్యంలో సత్కరించారు.



ఎస్ఎస్ఏలోని కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

ఆర్.ఆర్.పేటలో శ్రీవారికి పుష్పార్చన



ఏలూరు కార్పొరేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పాల్గుణమాసం తొలి శనివారం సందర్భంగా రామ చంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని భక్తులు తులసీదళాలు, పుష్పాలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కె.సత్యనారాయ ణాచార్యులు స్వామివారికి పం చామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ మేరకు వచ్చిన భక్తులకు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్ కుమార్, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.



స్వామి సన్నిధిలో ఉన్న డీసీపీ తిరుమలేశ్వర్ రెడ్డి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ

శ్రీవారి సేవలో ప్రముఖులు

ద్వారకాతిరుమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని పలువురు ప్రముఖులు శనివారం సందర్శించారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డీసీపీ కె.తిరుమలేశ్వరరెడ్డి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి. రమణ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అధి కారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ముందుగా వారు స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు వేదాశీర్వచనంతో పాటు శేష వస్త్రాలను అందజేశారు. ఆ తరువాత అధికారుల నుంచి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

పల్లాలమ్మ సేవలో ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు,మార్చి 8(ఆంధ్రజ్యోతి) :మండలంలోని రాచూరు గ్రామంలో శ్రీ పల్లాలమ్మను శనివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రెండవ రోజున సూర్య నమస్కారాలు, మహాలింగార్చనను ఎమ్మెల్యే ధర్మరాజు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన వేద స్వస్తి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ తరపున చైర్మన్ మందా శ్రీనివాస రెడ్డి పర్యవేక్షించారు.

శివకాశీపురంలో మహిళా దినోత్సవం

వేలేరుపాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివకాశీపురంలోని అంగన్వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాడిస రాము పాల్గొని మాట్లాడుతూ సామాజిక దూరాచారాల నుంచి మహిళలు బయటపడి ప్రత్యేక గుర్తింపును సాధించుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో పలు మహిళా సంఘాలు పాల్గొన్నాయి.



▸ ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

జీలుగుమిల్లి :బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆర్వో ప్లాంట్‌ను గారపాటి తపన చౌదరి ప్రారంభించారు. కూటమి తరపున గెలిచిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరిక మేరకు గిరిజన ప్రాంతంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసినట్టు చౌదరి తెలిపారు. అనంతరం జగదాంబ అమ్మవారిని దర్శించుకోగా చౌదరిని ఘనంగా సన్మానించారు.



▸ నేత్రపర్వంగా శివ కల్యాణం

ద్వారకాతిరుమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శివదేవుని ఆలయంలో స్వామి వారి కల్యాణం శనివారం నేత్రపర్వంగా జరిగింది. లోకకల్యాణార్థం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కల్యాణతంతు భక్తులను అలరించింది. ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులకు అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు.

అభివృద్ధే ప్రధాన లక్ష్యం : ఎంపీ

ఏలూరు టూటౌన్, మార్చి8(ఆంధ్రజ్యోతి) : జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు జన్మభూమి పార్కు పక్కన 20.50 లక్షల ఎంపీ నిధులతో బీసీ కమ్యూనిటీహాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా 5కోట్ల ఎంపీ నిధులతో దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ షేక్ నూర్జహాన్, జడ్పీచైర్మన్ గంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులు ఎంపీ మహేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మహేష్ కుమార్ ఆక్వా రైతుల నీటి అవసరాలు తీర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఎంపీ మహేష్‌ను ప్రజారోగ్య విభాగం డీఈ ఫణి భూషన్ కలిసి అభివృద్ధి పనులను వివరించారు.



బీసీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేసిన ఎంపీ

విద్యార్థినులకు రక్తపరీక్షలు

జంగారెడ్డిగూడెం (ఏలూరు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య పాఠశాలలో సాయిదుర్గ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించి విద్యార్థుల తల్లులకు, ఉపాధ్యాయినులు, విద్యార్థినులకు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఎ.పోశారావు, డాక్టర్ బి.శ్రీలత, డాక్టర్ ఎ.నీరజ్,ఆస్పత్రి ఎండీ ఎ.లక్ష్మీదుర్గ, శ్రీచైతన్య ఏవో కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరీక్షలకు 972 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ప్రథమ సంవత్సరం గణితం, జంతుశాస్త్రం, హిస్టరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 16,997మంది విదార్థులు దరఖాస్తు చేసుకోగా 16,025 మంది హాజరయ్యారని ఆర్ఐవో కె. యోహన్ తెలిపారు. జనరల్ విభాగంలో 14,407 మందికి 13,847 మంది, ఒకేషనల్ విభాగంలో 2590 మందికి 2178మంది హాజరయ్యారని వివరించారు.

177 కేసుల పరిష్కారం

చింతలపూడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 177 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌పై జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు మాట్లాడుతూ పరిష్కరించదగ్గ కేసులను రాజీకుదిర్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, పి.పి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ద్వారకాతిరుమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురానికి చెందిన 101 సంవత్సరాల వృద్ధురాలు కొయ్యలమూడి వెంకమ్మ వయోభారంతో శనివారం మృతి చెందారు. సరిగ్గా నూరేళ్లు పూర్తి చేసుకున్న ఆమెకు నలుగురు మగ, ఇద్దరు ఆడ సంతానం ఉన్నారు.

సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం

లింగపాలెం, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : లింగపాలెం మండలం లింగపాలెంలో సరమ్మతల్లి పేరంటాలు ఆలయం వద్ద విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో సరమ్మతల్లి పేరంటాలు ఆలయ ఉత్సవాలు ప్రారంభమవడంతో ఆలయం వద్ద విద్యుత్ సమస్యను పరిష్కరించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులతో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. లోవోల్టేజ్ సమస్య తీరడంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తాతిన రాధాకృష్ణ, ఏఈ శ్రీనివాసరావు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన భవనం కావాలి

పెదపాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రతి మంగళవారం దాతలు, భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఓ భవనం ఏర్పాటు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు విన్నవించారు. ఆలయ అర్చకులతో కలిసి వెళ్లి స్వామివారి ప్రసాదాలు అందజేసి, అన్నదాన భవనం ఏర్పాటు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

లావణ్యకు సీఐటీయూ సత్కారం

కుక్కునూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కుక్కునూరులోని విద్యాశాఖలో పని చేస్తున్న మెసెంజర్ లావణ్యకు ఉత్తమ సేవకురాలి అవార్డు దక్కింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏలూరు సీఐటీయూ ఆఫీస్‌లో ఉత్తమ సేవకురాలిని ఘనంగా సత్కరించారు. సమగ్ర శిక్షా శాఖలో అందించిన సేవలకుగాను లావణ్యను ఎంపిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చట్టాలను అమలు చేయాలి

కుక్కునూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సీఐటీయూ మండల కోశాధికారి బాడిస సుజాత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని కుక్కునూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. మహిళలపై పెరిగిన దాడులను అరికట్టాలని అన్నారు.



పామును పట్టుకున్న క్రాంతికుమార్

భారీ తాచు పాము పట్టివేత

జంగారెడ్డిగూడెం, (ఏలూరు) మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలోని రైతు పోల్నాటి శ్రీనివాస్ పామాయిల్ తోటలో కోళ్ల షెడ్డు వద్దకు శనివారం తాచు పాము ప్రవేశించింది. దీంతో రైతు శ్రీనివాస్ స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి కుమార్‌కు సమాచారం అందించారు. క్రాంతి కుమార్ అక్కడకు చేరుకుని తాచు పామును చాకచక్యంగా పట్టుకుని సురక్షితంగా అడవిలో విడిచిపెట్టారు.

రాజీ మార్గమే రాజమార్గం

నూజివీడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గం రాజమార్గమని తద్వారా కేసులను పరిష్కరించుకుని సమయాన్ని, ధనాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ సూచించారు. నూజివీడు కోర్టుహాలు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 31 సివిల్ కేసులు, 147 క్రిమినల్ కేసులు, 35 ఎస్.టి.సి కేసులు, 15 బ్యాంకు కేసులు పరిష్కరించామని తెలిపారు. మొత్తం 228 కేసులను పరిష్కరించి 1,25,44,960లను బాధితులకు నష్టపరిహారంగా అందించామన్నారు.

ఏలూరు ప్రధాన రహదారిపై
ప్రయాణం నరకం

నిధులు ఉన్నా...పనులు శూన్యం



నూజివీడు సాయిబాబా గుడివద్ద కోతకు గురైన రహదారి

ముసునూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారిపై ప్రయాణం నరకప్రాయం. అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు. అడుగుతీసి అడుగు వేయలేని పసి. ఒక గుంతను తప్పిస్తే మరొకటి సిద్ధం. ఈ లోగా వాహనాలు మీదుకు దూసుకువస్తాయి. ఎక్కడ గుంతలు ఉన్నాయో లేవో తెలియక భయాందోళనతో విధిలేని పరిస్థితిలో ఈ రహదారిపై ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఎంత ఖరీదైన కారులోనైన ఈ రహదారిలో కొద్ది కిలోమీటర్లు వేళ్ళేసరికి ఒళ్ళు హూనం అవాల్సిందే. నూజివీడు నుంచి సింహాద్రిపురం, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల మీదుగా ఏలూరు వెళ్ళే ఆర్‌అండ్‌బి రహదారి మరింత అధ్వానంగా మారి, తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికి గత వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధిని అమడదూరం పెట్టింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం దినదిన గండంగా మారిందని వాహనదారులు అంటున్నారు. జిల్లా కేంద్రం ఏలూరు వెళ్ళే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకపోకలు సాగితున్నాయి. ఈ రోడ్డు అభివృద్ధి, కనీసం నిర్వహణకు నోచుకోక ఈ మార్గంలో ప్రయాణమంటే వెన్నులో వణుకు పుట్టాల్సిందే. సంక్రాంతి నాటికి గుంతల రహదారులు ఎక్కడ కనిపించకూడదని, తక్షణమే రహదారులను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే అధికారయంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. కానీ నేటికి అధికారుల్లో మాత్రం చలనం లేదు. దీంతో కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రహదారికి మోక్షం కలుగుతుందో లేదో అనే సందేహం ప్రజల్లో వ్యక్తమౌతోంది.

నిధులు మంజూరై రెండేళ్ళు గడుస్తున్నా..

వర్షకాలంలో ఈ రహదారిలో ఉన్న గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పడంతోపాటు తీవ్ర గాయాలపాలవుతున్నారు. అయినా అభివృద్ధికి నోచుకోవడం లేదు. నూజివీడు నుంచి ముసునూరు మండలం వేల్పుచర్ల వరకు 22 కిలోమీటర్లకు రూ. 47.18కోట్లు నిధులు మంజూరై రెండేళ్ళు పూర్తికావస్తున్నా రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. అయితే గత ప్రభుత్వంలో కొంతమేర మార్జిన్‌ను తవ్వి కంకరపోసి, రోలింగ్ చేసిన కాంట్రాక్టర్ బిల్లులు అయ్యే పరిస్థితి లేదనే సందేహంతోనే మధ్యలోనే పనులు వదిలివేసినట్లు అధికారులు చెబుతున్నారు.

రహదారిని అభివృద్ధి చేయండి

నూజివీడు నియోజకవర్గ పరిధి, జిల్లా ముఖ్య కేంద్రం ఏలూరుకు వెళ్ళే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ముసునూరు మండలం వేల్పుచర్ల శివారు నుంచి ఏలూరు వరకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరావు ఆధ్వర్యంలో రోడ్డు వేశారని, వేల్పుచర్ల నుంచి నూజివీడు వరకు అధ్వానంగా ఉన్న రహదారి అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టేలా మంత్రి పార్థసారథి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభానికి చర్యలు



నిధులు ఉన్నా పనులు చేపట్టక పోవడానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం. పనులు చేస్తే బిల్లులు రావేమోనని సందేహంతో మందుకు రావడం లేదు. ఇప్పటికే కాంట్రాక్టర్‌కు ఉన్నతాధికారులు నోటీలు జారీ చేశారు. ఈ విషయం మంత్రి పార్థసారథి దృష్టిలో ఉంది. వీలైనంత త్వరలో పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

- అశోక్‌బాబు, ఆర్‌అండ్‌బి జేఈ



మట్టగుంటలో మహిళలను సత్కరిస్తున్న కూటమి నాయకులు



ఆగిరిపల్లి మండలంలో మహిళలకు సత్కారం

మహిళా సాధికారితతోనే సమాజ అభివృద్ధి

ఘనంగా మహిళా దినోత్సవం

చాట్రాయి/ముసునూరు/కలిదిండి/నూజివీడు టౌన్/ముదినేపల్లి/ఆగిరిపల్లి/కైకలూరు/మండవల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారితతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని చాట్రాయి మండల టీడీపీ నాయకులు మరిడి చిట్టిబాబు, బొట్టు లక్ష్మణరావు అన్నారు. చాట్రాయి మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అంగన్వాడీ, వెలుగు మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ లంకా నిర్మల, ఏపీఎం వెంకటేశ్వరరావు, ఎంఎస్ ప్రెసిడెంట్ నాగజ్యోతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. చిన్నంపేటలో మహిళా టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ప్రసంగించారు. ముసునూరులో ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మహిళా దినోత్సవాన్ని సిస్టర్ సుధారాణి ఆధ్వర్యంలో జరిగాయి. ఉదయం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీపీ కొండా దుర్గాభవాని, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు. బాలికలు, మహిళలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైద్యాధికారిణి డాక్టర్ షకీనా ఇవాంజలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, సిస్టర్ సుధారాణిలను ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపాల్ పి.వాణి, డి.బెనర్జీ పాల్గొన్నారు. కలిదిండిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, ఉత్తమ ప్రతిభ కనబర్చిన గ్రామ సంఘ సేవకులను సన్మానించారు. ఏపీఎం రవికుమార్, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. మట్టగుంటలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, కూటమి నాయకులు మహిళా ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లను సత్కరించారు. కూటమి నాయకులు నాగిడి వీరబ్రహ్మం, తిరుమాని పాండు రంగారావు, అండ్రాజు దుర్గారావు, గోపాలకృష్ణ, సర్పంచ్ అండ్రాజు రత్నమణి పాల్గొన్నారు. నూజివీడు కోర్టుహాలు ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ అదనపు జిల్లాజడ్జి ఎ.నాగశైలజ మాట్లాడుతూ ఆడపిల్లలను చదివించి అన్నిరంగాల్లో ముందుకు తీసుకురావాలని అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయం సత్యవాణి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్, ఏవో డాక్టర్ లక్ష్మణ్, సెంట్రల్ డీన్ శ్రావణి, సీతాపతి, దుర్గాభవానీ పాల్గొన్నారు. ముదినేపల్లి మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కార్యకర్తలను కైకలూరు సీడీపీవో డాక్టర్ వి.దీప్తి ఘనంగా సత్కరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, రత్న తులసీ, అరుణ కుమారి, జ్యోతి, రోజారాణి, సంధ్యారాణి, జ్యోతి, రాధాకృష్ణ కుమారిలను సత్కరించారు. సూపర్‌వైజర్లు ఝాన్సీ సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడు గ్రామంలోని ఎస్.ఆర్.ఐ కాలేజీలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ఉమెన్ ప్రొటెక్షన్ అండ్ గ్రీవెన్ సెల్ కన్వీనర్ డాక్టర్ సునీత, మెడ్‌సిటీ హాస్పిటల్ డాక్టర్ పద్మజ, సీహెచ్ స్వాతి, డాక్టర్ డి.కైలేశ్వరావు పాల్గొన్నారు. ఆగిరిపల్లి వెలుగు కార్యాలయంలో ఏపీఎం దయాల రాజశేఖర్ అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆగిరిపల్లి టీడీపీ నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచన రాణి, చౌటపల్లి విక్టర్‌బాబు, జోషిబాబు తదితరులు పాల్గొన్నారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కైకలూరు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న 42మంది మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకటకృష్ణ, మానవత సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ, మాజీ అధ్యక్షులు కొండ్రెడ్డి సత్యనారాయణ, మానవత సభ్యులు గుర్రం శ్యాంకుమార్, చింతపల్లి వెంకటనారాయణ, కేవీఎస్ఎం నాయుడు, రుద్రపాక రత్నాకరరావు పాల్గొన్నారు. కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 780 కేసులను రాజీ చేశారు. సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మీ, జూనియర్ సివిల్‌జడ్జి ఎం శివకిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయి, రూరల్ సీఐ వి.రవికుమార్ పాల్గొన్నారు. మండవల్లి సచివాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గాయత్రీ, కనకదుర్గ, ఆశావర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళల తోడ్పాటు, సహకారంతోనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అన్నారు. కుటుంబ గౌరవం మహిళలతో ముడిపడి ఉంటుందని అన్నారు.

పేదింటి మహిళల సేవలో ప్రభుత్వం: మంత్రి సారథి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సారథి

నూజివీడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):పేదింటి మహిళల సేవలో ఎన్‌డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల జీవనోపాధికి కుట్టుమిషన్లు అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో చంద్రబాబు పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బొబ్బిలి ఝాన్సీరాణి, మాజీ కౌన్సిలర్లు ఆర్.నాగమణి, కె.కృష్ణకుమారి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలి

నూజివీడు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు టిడ్కో భవనాలను ఇవ్వకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తోందని నూజివీడు సీపీఎం నాయకులు హెచ్చరించారు. శనివారం నూజివీడు ఎమ్మార్ అప్పారావుకాలనీలో టిడ్కోగృహాలను పరిశీలించారు. అనంతరం సీపీఎం నాయకులు జి.రాజు, ఎస్‌ఆర్ హనుమాన్లు మాట్లాడుతూ పేదలకు పక్కా ఇళ్లు అందిస్తామని గత తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం చేపట్టిన టిడ్కో గృహాలు 11సంవత్సరాలు గడిచినా పేదలకు అందలేదన్నారు.

పీ4 సర్వే పూర్తి చేయాలి

కలిదిండి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కొండలరావు అన్నారు. శనివారం కలిదిండిలో పీ4 సర్వేను పర్యవేక్షించారు. గ్రామాల్లో పేద కుటుంబాలను గుర్తించేందుకు పీ4 సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వేలో గుర్తించిన పేదలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

చాట్రాయి: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సి బ్బంది పీ-4 సర్వే చేపట్టారు. పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్(పీ-4) సర్వే చేపట్టిందని 16వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుందని అధికారులు తెలిపారు. దీనిపై 21 నుంచి 24 వరకు గ్రామ సభలు జరుగుతాయని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శివ నాగరాజు చెప్పారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ముసునూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. శనివారం రమణక్కపేటలో అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం, లిబరేషన్ నాయకులు సంయుక్తంగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తికావస్తున్న ఇచ్చిన హామీ లను నేరవేర్చటంలో విఫలమైందని విమర్శి ంచారు.

మృతుడి కుటుంబానికి మంత్రి చెక్కు అందజేత

ఆగిరిపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఈదర గ్రామంలోని చిట్టి పోతుల రామకృష్ణ (25) తన స్వగృహంలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై ప్రమాదవశాత్తు మరణించాడు. వారి కుటుంబ పరిస్థితిని ఇటీవల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి జి.ఆర్‌కె రంగారావు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే మంత్రి విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి నష్టపరిహారం త్వరగా అందేలా చూడాలని ఆదేశించారు. శనివారం ఆ కుటుంబానికి రూ.5లక్షలు చెక్‌ను మంత్రి మృతుని భార్య అయిన త్రివేణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి నీలం సుసేన్ దేవ్‌కుమార్, మృతుని కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ డార్మిటరీకి శంకుస్థాపన

ఏలూరు క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా రక్షణకు రాత్రింబవళ్ళు పనిచేసే పోలీస్ సేవలు అభినందనీయమని ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ కృషితో మహిళా పోలీస్ డార్మిటరీ నిర్మాణం కోసం ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి కేటాయించిన రూ.64.80 లక్షలతో నిర్మించనున్న మహిళా పోలీస్ డార్మెటరీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా పోలీస్ డార్మెటరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఎంపీ మహేష్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఎంపీ నిధులను మంజూరు చేశామన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియచేశారు.



చలో పిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, జనసేన నాయకులు

14న జనసేన చలో పిఠాపురం

కైకలూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ చలో పిఠాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం కైకలూరు సీతారామఫంక్షన్ హాలులో జనసేనపార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జయమంగళ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ గ్రామంలో జరిగే జనసేనపార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి కైకలూరు నియోజకవర్గం నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు. ఉదయం నుంచి కార్యకర్తలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వివిధ విభాగాల్లో ఉన్న అనుబంధ నాయకులు ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమానికి తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవిర్భావ దినోత్సవ సమన్వయకర్త రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి, తోట లక్ష్మీ, పుప్పాల సూర్యప్రకాశరావు, శౌంతి రాజేశ్వరి, సిరివరపు రాజబాబు, ఎఎస్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



మద్యం షాపు వద్దంటూ మహిళల ఆందోళన

ఆగిరిపల్లి,మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జంక్షన్ రోడ్డు మడుపల్లి కాంప్లెక్స్ ఎదురుగా జనావాసాల మధ్య మద్యం దుకాణానికి సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ నినదించారు. దీనితో మద్యం షాపు యజమానులు సోభనాచలం స్వామి గుడి రోడ్డులోని పొగడచెట్ల మండపం ప్లేస్కూల్ వద్ద ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. ఇక్కడ కూడా స్థానిక మహిళలు వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారు.



పెద్దింట్లమ్మకు విశేష పూజలు

కైకలూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. శనివారం అమ్మవారికి కలశపూజ, దూపసేవ, బాలభోగం, నీరాజన మంత్రపుష్పం, పంచహారతులు, అష్టోత్తర నామపూజ, నైవేద్య నీరాజన మంత్రపుష్పాలను నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని భుజబలపట్నం గ్రామానికి చెందిన పెన్మెత్స నాగవెంకట పాండురంగారావు, వెంకటలక్ష్మీ దంపతులు, మణికంఠ కృష్ణంరాజు, స్వాతి దంపతులు, వేగేశ్న పృథ్వీతేజ, నాగరమ్యకృష్ణ అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో గుడివాడకు చెందిన జయశ్రీ నాట్యమండలి రాజాచే పౌరాణిక నాటక ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరీక్షలకు 972 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ప్రథమ సంవత్సరం గణితం, జంతు శాస్త్రం, హిస్టరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 16,997మంది విదార్థులు దరఖాస్తు చేసుకోగా 16,025 మంది హాజరయ్యారని ఆర్ఐవో కె. యోహాన్ తెలిపారు. జనరల్ విభాగంలో 14,407 మందికి 13,847 మంది, ఒకేషనల్ విభాగంలో 2590 మందికి 2178మంది హాజరయ్యారని వివరించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

హడలెత్తిస్తున్న కుక్కల మందలు



చాట్రాయి వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

చాట్రాయి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో కుక్కల మందలు విపరీతంగా పెరిగిపోయి జనాన్ని హడలెత్తిస్తున్నాయి. పల్లెల్లో కుక్కలు మందలు మందలుగా పెరిగిపోయి మనుషులు పశువులపై దాడులకు తెగబడుతున్నాయి. 5, 6 ఏళ్ళ క్రితం వరకు గ్రామ పంచాయతీలు ఏడాదికి ఒక సారి వీధి కుక్కలను నిర్మూలించేవారు. దీనిపై శునక సంక్షేమ సంఘాలు కోర్టుల్లో కేసులు వేస్తుండటంతో వీధి కుక్కల నిర్మూలనకు స్వస్తి చెప్పారు. దీనితో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. మండలంలో అన్ని గ్రామాల్లో పౌల్ట్రీలు, చికెన్ సెంటర్లు పెరిగిపోవటం వలన వాటి వ్యర్థాలు తెచ్చి ఊరు శివార్లలో పారబోస్తున్నారు. వాటిని తిని కుక్కలు బలిష్టంగా తయారై మనుషులు, మూగజీవాలు కనపడితే వెంటబడి కరుస్తున్నాయి. దారినపోయే ద్విచక్ర వాహనాల వెంట పడుతుండటంతో కిందపడి గాయాల పాలవుతున్నారు.

ఇంటర్ గణితం, జువాలజీ
పరీక్షలు ప్రశాంతం

చాట్రాయి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో శనివారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం గణితం, జువాలజీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 90 మందికి గాను 87 మంది హాజరయ్యారని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు.

ఎక్సైజ్ దాడులు

నూజివీడు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఓగిరాల తండాలో అజ్మీరా సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీన పరుచుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ కె.ఎం.బి ఆరీఫ్, వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

బాత్రూంలో డెలివరీపై డీసీహెచ్‌ఎస్ విచారణ

» ఆడశిశువుకు జన్మినిచ్చి పరారైన తల్లి గుర్తింపు » సీసీ కెమెరాల ఆధారంగా యువతిని గుర్తించిన పోలీసులు » నిందితుడిపై పోక్సో కేసు నమోదు



కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో విచారణ చేస్తున్న జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీశ్‌కుమార్

కైకలూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కైకలూరు ప్రభుత్వా సుపత్రి మరుగుదొడ్డిలో ఆడశిశువుకు జన్మనిచ్చి పారిపోయిన తల్లిని కైకలూరు టౌన్ పోలీసులు కనుగొన్నారు. మండలంలో ఓ గ్రామానికి చెం దిన యువతిగా గుర్తించి శుక్రవారం అర్ధరాత్రి ఆ యువతి ఆమె తల్లిని కనుగొని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసహాయాన్ని అందిస్తున్నారు. ఆ యువతికి తండ్రి లేకపోవ డంతో తల్లి సంరక్షణలో పెరుగుతోంది. తల్లి కూలి పనులు చేసుకొని యువతిని పదో తరగతి వరకు చదివించింది. రెండు సంవత్సరాలుగా ఇంటి వద్దే యువతి ఉంటుంది. కొంతకాలంగా తల్లికి తమ్ముడు అయిన కె గణేశ్‌తో(33) ప్రేమ సంబంధం కొనసాగుతుంది. అతను లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ దశలో యువతి గర్భం దాల్చిన విషయాన్ని ఎవరికి బయటకు చెప్పవద్దని చెప్తే చంపేస్తానని గణేశ్ బెదిరించడంతో ఆ యువతి ఈ విషయాన్ని తల్లికి సైతం తెలియకుండా దాచుకుంటూ వచ్చింది. కడుపునొప్పి వస్తుందని ఈనెల 6వ తేదీ రాత్రి తల్లి మరో బంధువుతో కలిసి కైకలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం బాధితురాలు బాత్రూంకు వెళ్లగా ఆడశిశువుకు జన్మనిచ్చింది. అయితే శిశువు ప్రాణంతో ఉన్నది లేనిది స్పష్టత రాలేదు. మృతి చెందిన బిడ్డను బాత్రూం కప్‌బోర్డులో పడవేసి తల్లికూతురు పరారయ్యారు.

సీసీ కెమెరాల ఆధారంగా గుర్తింపు

పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగానే యువతిని గుర్తించారు. యువతి ఇంటికి వెళ్లి పోలీసులు వారికి నచ్చజెప్పి డెలీవరీ అయిన తరువాత చికిత్స పొందాలని తల్లిని, కుమార్తెను కైకలూరు ప్రభుత్వాసుపత్రికి సీఐ పికృష్ణ, ఎస్సై ఆర్.శ్రీను, డి వెంకట్ కుమార్‌లు చేర్పి చికిత్స అందించారు. ఇదిలా వుండగా నిందితుడు గణేశ్‌పై రేప్ కమ్ పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ పి.కృష్ణ తెలిపారు.

లోతైన విచారణకు కమిటీని వేస్తాం

బాత్రూంలో మృతశిశువు లభించిన విషయ ంపై జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణను డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కె పాల్ సతీశ్‌కుమార్ చేపట్టారు. శనివారం ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను, సిబ్బందిని, యువతిని వేరువేరుగా విచారణ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు ప్రాథమిక నివేదికను తయారు చేస్తున్నామని ప్రస్తుతం ఈ సమస్య పోలీసు కేసు నమోదై ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక కమిటీని వేసి పూర్తి స్థాయి విచారణ చేసి వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. శనివారం కూడా ఏడుగురు వైద్యులు విధులకు రావాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే హాజరు కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.